సంపుటి :02 సంచిక :245 పేజీలు :06

వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

మంగళవారం 02, డిసెంబర్ 2025

## కోటి మంది ఆడబిడ్డలకు సారెగా చీర

డీసీసీ అధ్యక్షులు ప్రతి ఇంటికి అందజేయాలి

టీపీసీసీ కార్యవర్గ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

02



## మునుగోడులో కొత్త ఒరవడి

- నియోజకవర్గంలో ఊరి బయటే వైన్ షాపులు
- మధ్యాహ్నం ఒంటిగంట నుంచి మద్యం అమ్మకాలు
- సాయంత్రం 6 గంటల తర్వాతే పర్మిట్ రూంలోకి అనుమతి
- ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ప్రతిపాదనలకు యజమానుల అంగీకారం

02




## పొరపాట్లు జరగొద్దు

రహదారి విస్తరణ పనులను వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



అక్షరదర్బార్, మేడారం: శ్రీ సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణంలో రాతి నిర్మాణాల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని, మేడారం రహదారి విస్తరణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం తాడ్వాయి మండలం మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్ లతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదివాసి సాంప్రదాయాలు ప్రతిబింబించేలా గద్దెల ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న రాతి నిర్మాణాల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని, రహదారి విస్తరణ పనుల్లో వేగం పెంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నూతనంగా ఏర్పాటు చేస్తున్న క్యూ లైన్స్ రెలింగ్ పనులను మేడారం స్తూపం వద్ద సర్కిల్ సుందరీకరణ పనులను, పరిశీలించి జాతర సమీపిస్తున్న తరుణంలో ముందస్తు వనదేవతల సందర్శనార్థం మొక్కులు చెల్లించడానికి వచ్చే భక్తులకు ఆటంకం కలగకుండా చూడాలని మాస్టర్ ప్లాన్ ప్రకారం నిర్దేశించిన గడువులోపు అభివృద్ధి పనులను పూర్తిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో, ఆర్అండ్ బీ, విద్యుత్ శాఖ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు



## డబ్బున్నోడే మా వాడు!

02

- జనరల్ స్థానాల్లో పోటీకి రూ.50 లక్షల క్యాష్ ఖర్చు చేయాల్సిందే..
- ఎస్సీ, ఎస్టీ స్థానాల్లో రూ.15 లక్షల వరకు ఖర్చు చేసే వారే అభ్యర్థులు
- అంగ బలం కంటే.. ఇప్పుడు ఆర్థిక బలం ఉన్నవారికే ప్రధాన పార్టీల మద్దతు
- ఎలాగైనా ఓట్లు రాబట్టుకోవాలని, గ్రామాల్లో పైచేయి సాధించాలనే పంతం
- మరికొందరి ఆశావహుల మనసుల్లో మాత్రం అనేక ప్రశ్నలు
- పెట్టిన డబ్బులు వెనక్కి వస్తాయో లేదోనని మీమాంస

### మునుపెన్నడూలేని విధంగా పంచాయతీ ఎన్నికలపై డబ్బు ప్రభావం

రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల మొదటి విడత, రెండో విడత ప్రక్రియ కీలక దశలకు చేరుకుంది. మొదటి విడత ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ గత నెల 29తో ముగిసింది. 30న నామినేషన్ల పరిశీలన పూర్తయింది. రేపు నామినేషన్ల ఉప సంహరణకు చివరి గడువు. అధికారులు ఏకగ్రీవం కానున్న పంచాయతీల సంఖ్య ప్రకటించిన తర్వాత పోటీ చేసే అభ్యర్థుల వివరాలు ప్రకటించనున్నారు. అలాగే రెండో విడత విషయానికి వస్తే, గత నెల 30న ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నేటి సాయంత్రంతో ముగిసింది. మొదటి విడతకు ఈనెల 11న, రెండో విడతకు 14న పోలింగ్ జరుగనుంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే ప్రధాన పోటీ నడుస్తున్నది. ఒకటి, రెండు విడుతల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక రెండు పార్టీలకూ కత్తిమీద సాములా మారింది. అభ్యర్థుల ఎంపిక విషయంలో డబ్బు ప్రభావం బాగా కనిపిస్తున్నది. ఒకప్పుడు ఒక వ్యక్తి వ్యక్తిత్వం, అతని రాజకీయ నేపథ్యం, గ్రామం కోసం ముున్ముందు అతనేం చేయగలడు.. అన్న ప్రశ్నలు వేసుకుని జనం ఓట్లేసే వారు. పార్టీలు కూడా అలాగే ఆలోచించేది. కానీ, ఇప్పటి పరిస్థితి పూర్తిగా మారిపోయింది. పైసామే పరమాత్మ అన్నట్లు.. ఎన్నికల్లో డబ్బు ఖర్చు పెట్టేవారికే పార్టీలు ప్రాధాన్యమిస్తున్నాయి. - అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

## డీసీసీ అధ్యక్షులకు దిశానిర్దేశం

- గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా సారథులతో సమావేశం
- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్, పార్టీ రాష్ట్ర ఇంచార్జి మీనాక్షి మార్గదర్శకాలు
- స్థానిక ఎన్నికల వ్యూహాలపై కాంగ్రెస్ దృష్టి
- ఎక్కువ సంఖ్యలో గ్రామాలను కైవసం చేసుకునేందుకు ఎత్తుగడలు

04

# ప్రజల చూపు బీజేపీ వైపు..

**ఆ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి రాణాప్రతాప్ రెడ్డి**

**బోల్లోనిపల్లిలో బీజేపీలో చేరిన యువకులు**




అక్షర దర్బార్, నల్లబెల్లి : ప్రజల చూపు బీజేపీ వైపే ఉన్నదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణాప్రతాప్ రెడ్డి తెలిపారు. మంగళవారం బోల్లోనిపల్లె గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి భూమ నరేష్ ఆధ్వర్యంలో గ్రామ యువకులు భూమ శ్రీకాంత్, భూమ సందీప్, చిక్కుడు రాకేష్, చిక్కుడు నగేష్, చిక్కుడు ప్రశాంత్‌లు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా రాణాప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోడీ చేస్తున్న అభివృద్ధి పనుల ప్రభావంతో యువత బీజేపీ వైపు ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు అధిక ప్రాధాన్యం ఇచ్చి వారిని ప్రజాప్రతినిధులుగా ఎదిగేలా చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు సిరికొండ పరామర్శ

**నివాళులర్పించిన మాజీ జెడ్పీటీసీ సాగర్**






అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండల కేంద్రంలో మంగళవారం కోడెల సమ్మయ్య, వెంకట్రావుపల్లి( సి) లో కల్వచర్ల కృష్ణమూర్తి, కైలాపూర్ గ్రామంలో ఆవుల చిన్న రాజయ్య మృతి చెందగా వారి అంతిమయాత్రలో ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, చిట్యాల మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొని నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



# సర్పంచ్ పదవికి పోటాపోటీ..!

- నడికూడ మండలంలో పొలిటికల్ హీట్
- ప్రధాన రాజకీయ పార్టీల్లో జంపుల పర్వం
- అభ్యర్థుల ఖరారుపై నేతల్లో అసంతృప్తి
- పులిగిల్ల, రాయపర్తి గ్రామాల్లో భారీగా జంపులు
- పంచాయతీ పోరులో స్వతంత్ర అభ్యర్థుల జోరు



అక్షరదర్బార్, పరకాల: పంచాయతీ ఎన్నికల పోలింగ్ సమీపిస్తుండటంతో పరకాల నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఊరూరా పొలిటికల్ హీట్ పెరిగింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లో ఆయా పార్టీ మద్దతు కోసం నేతల మధ్య పోటీ తలెత్తడంతో జంపులపర్వం ఊపందుకుంది. కొన్ని గ్రామాల్లో ఇది మరింత ఉగ్రరూపం దాల్చింది. నడికూడ మండలంలో పలువురు నేతలు వరుసగా పార్టీ కండువాలను మారుస్తూ రాజకీయంగా ఆసక్తి రేపుతున్నారు. నవంబర్ 27న పులిగిల్ల గ్రామంలో బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు జరగగా, డిసెంబర్ 1న రాయపర్తి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ వైపు అడుగులు వేయడంతో నడికూడ మండలంలో రాజకీయంగా కొత్త సమీకరణలకు తెరలేచింది. దీంతో మూడో విడతలో పంచాయతీ ఎన్నికలు జరగనున్న నడికూడ మండలంలోని 14 గ్రామాల్లో పోటీకి సిద్ధమైన నాయకులు స్వతంత్రంగా సర్పంచ్, వార్డ్ సభ్యుల స్థానాలకు నామినేషన్లు వేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

### టికెట్ రాకుంటే మరో పార్టీలోకి..

సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేయాలని ఉబలాటపడుతున్న ఆశావాహులు ప్రధాన పార్టీల్లో మద్దతు దక్కకుంటే మరో పార్టీలో చేరేందుకు ఇప్పటికే ప్రణాళికలు రూపొందించుకున్నారని పొలిటికల్ సర్కిల్ లో చర్చ నడుస్తోంది. మండల కేంద్రం సర్పంచ్ బీసీకి రిజర్వ్ కావడంతో కాంగ్రెస్ పార్టీలో రెబల్ అభ్యర్థులు ముందుకొస్తున్నట్లు తెలిసింది. పార్టీ నుంచి మద్దతు లభించకపోయినా సర్పంచ్ పదవికి పోటీలో ఉండేందుకు సిద్ధమని స్థానిక కాంగ్రెస్ నాయకులు కొందరు స్పష్టం చేస్తున్నారు.

### గ్రూపు రాజకీయాలు..

అభ్యర్థుల ఖరారు, స్థానిక నాయకుల ఆధిపత్యం, గ్రూపు రాజకీయాలు నడికూడ మండలంలో జోరుగా సాగుతున్నాయి. పంచాయతీ ఎన్నికల్లో ఆధిపత్యం సాధించాలనే ఉద్దేశంతో రెండు ప్రధాన పార్టీలూ దూకుడు పెంచడంతో నేతల కండువాల మార్పు మరింత వేగం అందుకుంది. ఉదయం ఒక పార్టీలో.. సాయంత్రం మరో పార్టీలో కనిపించే పరిస్థితి ఏర్పడడంతో ఓటర్లలో కూడా అయోమయ పరిస్థితి నెలకొంది. తరచూ నాయకుల మార్పులపై ఆయా పార్టీ నాయకత్వం నిఘా కట్టుదిట్టం చేసింది. అసంతృప్తిని తొలగించి పరిస్థితి చక్కబెట్టేందుకు సమావేశాలు, చర్చలు ముమ్మరం చేస్తుంది. అయితే ఎన్నికల పోలింగ్ దగ్గరపడుతున్న కొద్దీ ఈ జంపుల జోరు మరింత పెరిగే అవకాశం ఉన్నట్టు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.



# మెడికల్ కాలేజీకి ఓంకార్ పేరు పెట్టాలి

**ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్**

అక్షర దర్బార్, వరంగల్ : నర్సంపేట మెడికల్ కాలేజీకి వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు అమరజీవి కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ పేరు పెట్టాలని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వో విజయలక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పెద్దారపు రమేష్ మాట్లాడుతూ.. ప్రజల కోసం జీవితాంతం త్యాగం చేసిన కామ్రేడ్ ఓంకార్ చరిత్రను భవిష్యత్ తరాలకు చేరేలా పాఠ్యాంశంలో చేర్చాల్సిన అవసరం ఉందని చెప్పారు. నైజాం వ్యతిరేక సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన ఆయన ఐదుసార్లు నర్సంపేట ఎమ్మెల్యేగా ఎన్నికై, స్వప్రయోజనాలు లేకుండా ప్రజల కోసం పని చేసి "అసెంబ్లీ టైగర్"గా పేరుపొందారని తెలిపారు. ఓంకార్ సేవలకు గుర్తింపుగా నర్సంపేట మెడికల్ కాలేజీకి, స్టేడియంకు ఆయన పేరు పెట్టాలని, నర్సంపేట–వరంగల్ రోడ్డును "ఓంకార్ మార్గ్"గా ప్రకటించాలని, అలాగే ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించి స్మృతి వనం ఏర్పాటు చేయాలని రమేష్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యు) జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, నగర కార్యదర్శి మాలోత్ సాగర్, చుంచు జగదీశ్వర్, ఐతమ్ నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# గీతాంజలి విద్యార్థికి 'నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్' రికార్డ్

అక్షర దర్బార్, నర్సంపేట టౌన్ : గీతాంజలి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థి అరుదైన ఘనతను సాధించాడు. నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన 9×9 సుడోకు పోటీల్లో పాఠశాలకు చెందిన ఒకటో తరగతి విద్యార్థి వేముల దేవాన్ష్ అతి తక్కువ సమయంలో సుడోకును పూర్తి చేసి నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ లో చోటు దక్కించుకున్నాడు. విద్యార్థి విజయం పట్ల గీతాంజలి విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వేములపల్లి సుబ్బారావు హర్షం వ్యక్తం చేశారు. ప్రతిభకు వయసు అడ్డం కాదని ఐదేళ్ల ప్రాయంలోనే అరుదైన రికార్డు సాధించిన విద్యార్థి దేవాన్ష్‌ను ప్రోత్సహించిన తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు.



తమ పాఠశాల విద్యార్థి దేవాన్ష్ విజయం పట్ల ప్రిన్సిపాల్ రాజేష్, టీచర్ రాధా హర్షం వ్యక్తం చేశారు.

# నాసిరకం డ్రైనేజీ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి

**కమిషనర్ కు వినతిపత్రం అందజేసిన బీజేపీ నాయకులు**

అక్షరదర్బార్, పరకాల: పరకాల పట్టణంలో నాణ్యత లేని సైడ్ డ్రైనేజీ కాలువల నిర్మాణంపై బీజేపీ నాయకులు మండిపడ్డారు. తాజాగా నిర్మాణంలో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని, కరెంటు స్తంభాలు తొలగించకుండానే వాటి మధ్యగానే డ్రైనేజీ నిర్మించడం కాంట్రాక్టర్ పనితీరుకు నిదర్శనమని వారు ఆక్షేపించారు. పట్టణ శాఖ అధ్యక్షుడు గాజులు నిరంజన్ ఆధ్వర్యంలో బీజేపీ ప్రతినిధుల బృందం మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. పరకాలలో జరుగుతున్న కొత్త డ్రైనేజీ పనులను వెంటనే పర్యవేక్షించి, నాణ్యతతో నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి సంఘ పురుషోత్తం, జిల్లా నాయకులు కుక్కల విజయ్ కుమార్, ఉపాధ్యక్షులు మిడిదొడ్డి నరేష్, కార్యదర్శి దార్న సునీల్ తదితరులు పాల్గొన్నారు.





# డీసీసీ అధ్యక్షులకు దిశానిర్దేశం

- గాంధీభవన్ లో కాంగ్రెస్ పార్టీ జిల్లా సారథులతో సమావేశం
- పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్, పార్టీ రాష్ట్ర ఇంచార్జి మీనాక్షి మార్గదర్శకాలు
- స్థానిక ఎన్నికల వ్యూహాలపై కాంగ్రెస్ దృష్టి
- ఎక్కువ సంఖ్యలో గ్రామాలను కైవసం చేసుకునేందుకు ఎత్తుగడలు

అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణలో గ్రామీణ పాలన పగ్గాలను చేపట్టాలనే సంకల్పంతో కాంగ్రెస్ పార్టీ దూకుడు పెంచింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జరగబోయే మొట్టమొదటి స్థానిక సంస్థల ఎన్నికలు కావడంతో, ఈ పంచాయతీ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ నేపథ్యంలో, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులతో కీలక సమావేశం జరిగింది. సమావేశంలో పంచాయతీ ఎన్నికలకు సంబంధించి విస్తృతమైన వ్యూహాలపై చర్చ జరిగినట్లు సమాచారం. ఎక్కువ సంఖ్యలో గ్రామాలను కైవసం చేసుకునేందుకు ఎత్తుగడలు సిద్ధం చేసినట్లు బోగట్టా. డీసీసీ అధ్యక్షులకు కాంగ్రెస్ వ్యవహారాల రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పార్టీ సంస్థాగత బలోపేతంపై దిశానిర్దేశం చేశారని తెలిసింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు, ఇతర సంక్షేమ పథకాలు పంచాయతీ ఎన్నికల్లో పార్టీకి ఏ విధంగా లాభం చేకూర్చే అంశాన్ని చర్చించి, వాటిని ప్రజల్లోకి మరింత సమర్థంగా తీసుకెళ్లడానికి మార్గాలను అన్వేషించారు. బలహీనంగా ఉన్న గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయడం, ప్రతిపక్ష పార్టీ కంచుకోటలను ఛేదించడం కోసం ప్రణాళికలు రచించినట్లు సమాచారం. 'రైతు భరోసా', 'మహాలక్షి ' వంటి పథకాలను ప్రచారం చేసి పార్టీకి మద్దతు కూడగట్టాలని డీసీసీ అధ్యక్షులకు ఆదేశాలు వచ్చాయని తెలిసింది.

# రాజ్ భవన్ ఇకపై లోక్ భవన్




అక్షరదర్బార్, హైదరాబాద్ : తెలంగాణ రాజ్‌భవన్ పేరును ఇకపై లోక్‌భవన్‌గా వ్యవహరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం అధికారిక నోటిఫికేషన్ జారీ చేసింది. 'రాజ్' అనే పదం వలసవాదానికి సంబంధించినదని కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రతిబింబించే 'లోక్' (ప్రజలు) అనే పదాన్ని చేర్చాలనుకుంది. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఇటీవల గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లకు లేఖ రాసింది. రాజ్‌భవన్, రాజ్ నివాస్ పేర్లను వరుసగా లోక్‌భవన్, లోక్‌నివాస్‌లుగా మార్చే అంశాన్ని పరిశీలించాలని ఆ లేఖలో స్పష్టం చేసింది. ఈ సూచనలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దేశంలోని వలసవాదపు చిహ్నాలను, పేర్లను తొలగించే కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలలో భాగంగా ఈ చర్య తీసుకోబడింది. ఇప్పటికే పశ్చిమబెంగాల్, తమిళనాడు, గుజరాత్, అస్సాం, కేరళ, త్రిపుర, ఒడిశాతో సహా పలు రాష్ట్రాలు తమ రాజ్‌భవన్‌ల పేర్లను లోక్‌భవన్‌లుగా మార్చాయి.

# సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి : సీపీ

## వరంగల్ పోలీస్ కమిషన్ సన్ ప్రీత్ సింగ్



అక్షరదర్బార్, హనుమకొండ: పదవీ విరమణ అనంతరం పోలీస్ సిబ్బంది సేవా కార్యక్రమాలకు సమయం కేటాయించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ విభాగంలో సుధీర్ఘకాలం విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన పోలీస్ అధికారులను మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీస్ శాఖకు సేవలందించి పదవీ విరమణ చేస్తున్న అధికారులు నేటి తరం పోలీసులకు ఆదర్శంగా నిలుస్తారని, పదవీ విరమణ అనంతరం ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, సురేష్ కుమార్, శ్రీనివాస్, ఏసీపీ సురేంద్ర, ఆర్ఐ సతీష్, స్పర్జన్ తో పాటు, ఇతర పోలీస్ సిబ్బంది  పాల్గొన్నారు.



# మెడికల్ కాలేజీకి మళ్లీ శంకుస్థాపన హాస్యాస్పదం

## –మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి




అక్షర దర్బార్, నర్సంపేట :  నర్సంపేట అభివృద్ధికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో వేల కోట్లు పెట్టుబడులతో చేపట్టిన పనులను, మళ్లీ కాంగ్రెస్ ముఖ్యమంత్రితో శంకుస్థాపన చేయించడం హాస్యాస్పదమని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన నర్సంపేటలో మీడియాతో మాట్లాడారు. నర్సంపేటకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రావడం మంచి పరిణామమే అయినా, గతంలోనే ప్రారంభించిన మెడికల్ కాలేజీ, గురుకులాల భవనాలు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ తదితర పనులకు మళ్లీ శంకుస్థాపన చేయడం అభివృద్ధిని అపహాస్యం చేయడమేనని పేర్కొన్నారు. మొంథా తుపాన్‌తో నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం అందించాలని కోరారు. నియోజకవర్గంలో సైనిక్ స్కూల్‌తో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలను బీఆర్ఎస్ ప్రభుత్వమే ఏర్పాటు చేసిందని, ప్రతి మండల గురుకులాలకు కొత్త భవనాలు నిర్మించాల్సిన అవసరం ఉందని చెప్పారు. 179 గ్రామాల్లో బీటీ రోడ్లు, రూ.183 కోట్లతో మెడికల్ కాలేజీ, రూ.7 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్, రూ.5 కోట్లతో ఆడిటోరియం వంటి అనేక అభివృద్ధి పనులు తమ పాలనలోనే ప్రారంభమయ్యాయని గుర్తుచేశారు. అయితే ఇవి ప్రారంభ దశలోనే ఆగిపోయాయని, రెండేళ్లుగా నర్సంపేటలో అభివృద్ధి నిలిచిపోయిందని విమర్శించారు. గోదావరి జలాలను పాకాల, మాదన్నపేట చెరువులకు తీసుకురావడానికి రూ.160 కోట్ల ప్రతిపాదనలు సిద్ధం చేశామని, కానీ ఆ పనులు కూడా ముందుకు సాగలేదని తెలిపారు. నర్సంపేట అభివృద్ధి కోసం మాటలు కాకుండా నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆరెస్సెస్ రాష్ట్ర మాజీ డైరెక్టర్, పట్టణ పార్టీ అధ్యక్షులు, మాజీ వైస్ చైర్మన్, మాజీ ఎంపీపీ, బీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీలో అక్షరాభ్యాసం




అక్షర దర్బార్ చిట్యాల : చిట్యాల మండలం శాంతినగర్ గ్రామంలోని అంగన్వాడీ సెంటర్లో మంగళవారం అక్షరభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. చిట్యాల సెక్టార్ సమావేశం ఐసీడీఎస్ సూపర్వైజర్ జయప్రద ఆధ్వర్యంలో తుమ్మల అనిల్ తేజ దంపతుల కూతురుకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో 30 మంది అంగన్వాడీ టీచర్స్ ఆయా కోమల పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి



అక్షర దర్బార్, మొగుళ్ళపల్లి: మొదటి విడత స్థానిక సంస్థల ఎన్నికల్లోని మొగుళ్ళపల్లి, ములుగు ఘనపూర్, గోరి కొత్తపల్లి, రేగొండ మండలాల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచ్. వార్డు మెంబర్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకుడు అజయ్ రెడ్డి మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..  ప్రజా సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్న కాంగ్రెస్ప్రభుత్వం బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి
- సీఎం సభా స్థలం పరిశీలన



అక్షర దర్బార్, నర్సంపేట : నర్సంపేట పట్టణంలో ఈనెల 5న జరిగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభ అన్ని ఏర్పాట్లను చేసినట్లు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్, డీసీపీ అంకిత్ కుమార్ తో కలిసి సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. సీఎం హెలికాప్టర్ ల్యాండింగ్‌కు అనుకూలమైన స్థలం, అలాగే సభ నిర్వహణ ప్రాంతంలో భద్రత, పార్కింగ్, రాకపోకలు వంటి ఏర్పాట్లను వారు సమీక్షించారు. నర్సంపేటలో సుమారు 1,000 కోట్ల రూపాయల అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమం నేపథ్యంలో అధికారులు సమగ్ర ఏర్పాట్లు చేస్తోన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ పున్నం రవీందర్ రెడ్డి, ఎస్బి ఏసీపీ జితేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కాట భాస్కర్, టీపీసీసీ సభ్యులు పెండెం రామానంద్, డాక్టర్ పులి అనిల్, పిఎసిఎస్ చైర్మన్ బొబ్బల రమణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చింతల సాంబరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్ర యాకుబ్ రెడ్డి, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, మాజీ కౌన్సిలర్ ఓర్సు అంజలీ, గంధం నరేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు తుమ్మలపెల్లి సందీప్, మోడెం ఎల్లగౌడ్, రూపిక శ్రావణ్ కుమార్, కాట ప్రభాకర్, పబ్బతి సతీష్ రెడ్డి, పోతారబోయిన చంద్రమౌళి, బాణాల శ్రీనివాస్, మేరుగు కిరణ్, గద్ద అఖిల్ తదితరులు పాల్గొన్నారు.




- మునుపెన్నడూలేని విధంగా పంచాయతీ ఎన్నికలపై డబ్బు ప్రభావం
- ఎస్సీ, ఎస్టీ స్థానాల్లో రూ.15 లక్షల వరకు ఖర్చు చేసే వారే అభ్యర్థులు
- అంగ బలం కంటే.. ఇప్పుడు ఆర్థిక బలం ఉన్నవారికే ప్రధాన పార్టీల మద్దతు
- ఎలాగైనా ఓట్లు రాబట్టుకోవాలని, గ్రామాల్లో పైచేయి సాధించాలనే పంతం
- మరికొందరి ఆశావహుల మనసుల్లో మాత్రం అనేక ప్రశ్నలు
- పెట్టిన డబ్బులు వెనక్కి వస్తాయో లేదోనని మీమాంస

జనరల్ స్థానాల్లో పోటీకి రూ.50 లక్షల క్యాష్ ఖర్చు చేయాల్సిందే..

# డబ్బున్నోడే మావాడు!

**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి :**

రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల మొదటి విడత, రెండో విడత ప్రక్రియ కీలక దశలకు చేరుకుంది. మొదటి విడత ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ గత నెల 29తో ముగిసింది. 30న నామినేషన్ల పరిశీలన పూర్తయింది. రేపు నామినేషన్ల ఉప సంహరణకు చివరి గడువు. అధికారులు ఏకగ్రీవం కానున్న పంచాయతీల సంఖ్య ప్రకటించిన తర్వాత పోటీ చేసే అభ్యర్థుల వివరాలు ప్రకటించనున్నారు. అలాగే రెండో విడత విషయానికి వస్తే, గత నెల 30న ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నేటి సాయంత్రంతో ముగిసింది. మొదటి విడతకు ఈనెల 11న, రెండో విడతకు 14న పోలింగ్ జరుగనుంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే ప్రధాన పోటీ నడుస్తున్నది. ఒకటి, రెండు విడుతల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక రెండు పార్టీలకూ కత్తిమీద సాములా మారింది. అభ్యర్థుల ఎంపిక విషయంలో డబ్బు ప్రభావం బాగా కనిపిస్తున్నది. ఒకప్పుడు ఒక వ్యక్తి వ్యక్తిత్వం, అతని రాజకీయ నేపథ్యం, గ్రామం కోసం ముమ్ముందు అతనేం చేయగలడు.. అన్న ప్రశ్నలు వేసుకుని జనం ఓట్లేసే వారు. పార్టీలు కూడా అలాగే ఆలోచించేది. కానీ, ఇప్పటి పరిస్థితి పూర్తిగా మారిపోయింది. పైసామే పరమాత్మ అన్నట్లు.. ఎన్నికల్లో డబ్బు ఖర్చు పెట్టేవారికే పార్టీలు ప్రాధాన్యమిస్తున్నాయి.


### - జంపింగ్ జపాంగులు

పంచాయతీ ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య ప్రధానంగా పోటీ నెలకొంది. పంచాయతీ ఎన్నికల్లో పార్టీ గుర్తు ఉండదు కాబట్టి.. ఫలానా పార్టీ బలపరిచిన అభ్యర్థులు అని ప్రచారం చేసుకోవాల్సి ఉంటుంది. ఆశావహులు ప్రధాన పార్టీల మద్దతు కోసం తీవ్రమైన కృషి చేస్తున్నారు. లక్కుతో ఒక పార్టీ మద్దతు ఒకరు తీసుకుంటే, మిగిలిన ఆశావహులు అప్పటి వరకు అదే పార్టీలో ఉండి, పార్టీ మద్దతు కోసం మరో పార్టీకి మారుతున్నారు. దీంతో ఉదయం ఒక పార్టీలో ఉన్నవారు సాయంత్రం మరో పార్టీలో ఉంటున్నారు. పొద్దున గులాబీ కండువా వేసుకున్న వారు సాయంత్రం కాంగ్రెస్ కండువా కప్పుకుంటున్నారు.

### - అంత ఖర్చు చేస్తే మరి రిటర్న్స్?

అంత ఖర్చు చేస్తే తీరా సర్పంచ్ అయ్యాక మనం సంపాదించుకోగలుగుతామా.. అన్న సందేహం ఎక్కువ మంది ఆశావహులను ఆలోచింపజేస్తున్నది. సాధారణంగా ఎన్నికల్లో గెలిచిన తర్వాత నెలకు సర్పంచ్‌లకు ప్రభుత్వం నుంచి వచ్చే గౌరవ వేతనం రూ.6,500 మాత్రమే. అవి కూడా ఎప్పుడొస్తాయో.. ప్రభుత్వం ఏరోజు విడుదల చేస్తుందో తెలియదు. పైగా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు ఎప్పుడు బిల్లులు విడులవుతాయో తెలియదు. క్రితం సారి సర్పంచ్‌లుగా పనిచేసిన వారికి ఇప్పటికీ బిల్లులు విడుదల కాలేదు. వారి ఇప్పటికీ ఆ బిల్లుల కోసం ఎదురుచూస్తునే ఉన్నారు. ఈ నేపథ్యంలో మనం రిస్క్ చేయడం అవసరమా? అనే కోణంలో కొందరు ఆలోచిస్తున్నారు.




### - వేల నుంచి లక్షల వరకు ఖర్చు

ఎన్నికల సంఘం నిబంధనలు ఎలాగున్నా, ఎలక్షన్‌లో డబ్బు , ప్రలోభాలు లేకుండా పని జరగదన్న సంగతి బహిరంగ రహస్యమే. గ్రామాల్లోనైతే ఒకప్పుడు వేలల్లో ఖర్చయ్యేది. ఇప్పుడు లక్షలకు చేరింది. జనరల్ స్థానాల్లో సుమారు రూ.50 లక్షల వరకు ఖర్చు పెట్టేవారికి ప్రాధాన్యం పార్టీలు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎందుకంటే జనరల్ స్థానాల్లో కాస్త డబ్బున్న ఆగ్రకులాల వారు ఎక్కువగా పోటీ చేస్తారు. కాబట్టి.. సర్పంచ్ పదవిని స్టేటస్‌గాభావించే వారు ఎంతైనా ఖర్చు పెడతారు కాబట్టి, పార్టీలన్నీ శ్రీమంతుల వైపే మొగ్గుచూపుతున్నాయి. జనరల్ స్థానాల్లో శాయశక్తులా పనిచేసి ఏకగ్రీవం చేసేందుకు ప్రధాన పార్టీలన్నీ క్రుషి చేస్తున్నాయి. ఎస్టీ, ఎస్సీ స్థానాల్లో పోటీ చేసే వారికి రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఖర్చు పెట్టేవారికి తెలిసింది.

# కోటి మంది ఆడబిడ్డలకు సారెగా చీర

- డీసీసీ అధ్యక్షులు ప్రతి ఇంటికి అందజేయాలి
- టీపీసీసీ కార్యవర్గ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి



అక్షరదర్బార్, హైదరాబాద్: ఇందిరమ్మ చీరల పంపిణీపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారని, ఆడబిడ్డలకు సారెగా కోటి చీరెలు అందిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ లో నిర్వహించిన టీపీసీసీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ ఆడబిడ్డకు చీర చేరేలా చూడాల్సిన బాధ్యత డీసీసీ అధ్యక్షులదేనని, డిసెంబర్ లోగా గ్రామీణ ప్రాంతాల్లో 65 లక్షల చీరల పంపిణీని పూర్తి చేయాలని ఆదేశించారు. మార్చిలో పట్టణ ప్రాంతాల్లో మహిళలకు మిగిలిన 35 లక్షల చీరలను పంపిణీ చేయాలని సూచించారు. పార్టీ నాయకులకు, జిల్లా అధ్యక్షులకు బాధ్యతను గుర్తు చేస్తూ, జిల్లా అధ్యక్షుడు అనేది గొప్ప బాధ్యత అని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదని పేర్కొన్నారు. రాజకీయాల్లో కాళ్లలో కట్టెలు పెట్టడం సహజమని, దానిని పెద్ద సమస్యగా భావించకుండా, అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని పార్టీ నాయకులకు సూచించారు. రాజకీయ అంశాలపై మాట్లాడుతూ, రాహుల్ గాంధీ చేపట్టిన 'ఓట్ చోరీ' కార్యక్రమం నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే నేషనల్ హెరాల్డ్ కేసుల పేరుతో కేంద్రం హడావుడి చేస్తుందని విమర్శించారు. ఏఐసీసీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పై పెట్టిన అక్రమ కేసులను తీవ్రంగా ఖండిస్తూ కార్యవర్గ సమావేశంలో తీర్మానం చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యాన్ని గురించి వివరిస్తూ, 2034 నాటికి వన్ ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దాలని ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ఈ నెల 8, 9న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' నిర్వహించుకుంటున్నామని, ఆ కార్యక్రమంలోనే తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరించబోతున్నామని వెల్లడించారు.

# 'మునుగోడు'లో కొత్త ఒరవడి

- నియోజకవర్గంలో ఊరి బయటే వైన్ షాపులు
- మధ్యాహ్నం ఒంటిగంట నుంచి మద్యం అమ్మకాలు
- సాయంత్రం 6 గంటల తర్వాతే పర్మిట్ రూంలోకి అనుమతి
- ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ప్రతిపాదనలకు యజమానుల అంగీకారం

అక్షరదర్బార్, మునుగోడు : మునుగోడు నియోజకవర్గంలో మద్యం విక్రయ సమయాల్లో మార్పు, అమ్మకాలు జరిపే సమయాల్లో మార్పు కోసం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్రంగా క్రుషి చేసి చివరకు సాధించగలిగారు. ఇటీవల హైదరాబాద్‌లోని తన నివాసంలో మద్యం షాపుల యజమానులతో ప్రత్యేకంగా సమావేశమైన ఆయన, ఈ నియమాలపై వారికి దిశానిర్దేశం చేశారు. ప్రజారోగ్యాన్ని ద్రుష్టిలో పెట్టుకుని, నేరాల తీవ్రత తగ్గించేందుకు ఎమ్మెల్యే చేసిన సూచనల మేరకు కొత్తగా లైసెన్సులు దక్కించుకున్న వైన్ షాపుల యజమానులు దుకాణాలను గ్రామాల బయటే ఏర్పాటు చేశారు. విచ్చలవిడి మద్యం వినియోగాన్ని నియంత్రించే ఉద్దేశంతో విక్రయాలను మధ్యాహ్నం ఒంటిగంట తర్వాతే మొదలుపెడతామని హామీ ఇచ్చారు. అంతేకాదు.. సాయంత్రం 6 గంటల నుంచి మాత్రమే పర్మిట్ రూమ్‌లోకి అనుమతులు ఉంటాయి. గ్రామాలను పట్టిపీడిస్తున్న బెల్ట్ షాపులకు మద్యం విక్రయాలు పూర్తిగా నిలిపివేయాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. బెల్ట్ షాపుల నిర్మూలన ద్వారా గ్రామాలలో అప్పటికే ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొని, క్రైమ్ రేటు తగ్గుతుందని ఎమ్మెల్యే ఆకాంక్షిస్తున్నారు. మునుగోడులో అమలవుతున్న నూతన మద్యం నియంత్రణ విధానం ఇతర




ప్రాంతాలకూ ఆదర్శంగా నిలిచే అవకాశం ఉందనే అభిప్రాయం ప్రజానీకం నుంచి వ్యక్తమవుతున్నది.

# ముగిసిన రెండో విడత నామినేషన్ల ప్రక్రియ

- ఆఖరి రోజు జోరుగా నామినేషన్ల దాఖలు
- సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటాపోటీగా నామినేషన్లు
- రేపటి నుంచి మూడో విడత నామినేషన్ల స్వీకరణ
- క్లస్టర్ వారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు



అక్షరదర్బార్, వరంగల్: పంచాయతీ ఎన్నికల రెండో విడత నామినేషన్ల స్వీకరణ గడువు ముగిసింది. మూడు రోజులపాటు సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు. డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మొదటి విడత 11న ఎన్నికలు జరిగే గ్రామపంచాయతీల్లో ఈనెల 27 నుంచి 29 వరకు నామినేషన్ల స్వీకరణ జరిగింది. 14న జరగనున్న రెండో విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించి గత నెల 30వ తేదీన నామినేషన్ల స్వీకరణ మొదలైంది. ఆదివారం నుంచి మంగళవారం వరకు మూడు రోజులపాటు సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. చివరి రోజైన మంగళవారం సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఎక్కువ మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఆఖరి రోజు కావడంతో మంగళవారం ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో నామినేషన్ల హోరు కనబడింది. సాయంత్రం ఐదు గంటలలోపు నామినేషన్ల కేంద్రంలోకి వచ్చిన అభ్యర్థులందరి నుంచి అధికారులు నామినేషన్లను స్వీకరించారు.

### - ఉమ్మడి వరంగల్ జిల్లాలో

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొదటి విడతతో పాటు రెండో విడత కూడా నామినేషన్ల స్వీకరణ ప్రశాంతంగా ముగిసింది. రెండో విడతలో హనుమకొండ జిల్లాలో ఐనవోలు, ధర్మసాగర్, వేలేరు, హసన్ పర్తి, పరకాల మండలాల్లో, వరంగల్ జిల్లాలో సంగెం, గీసుకొండ, దుగ్గొండి, నల్లబెల్లి మండలాల్లో, మహబూబాబాద్ జిల్లాలోని ఏడు మండలాల్లో, భూపాలపల్లి జిల్లాలో చిట్యాల, టేకుమట్ల, పలిమెల, భూపాలపల్లి మండలాల్లో, జనగామ జిల్లాలోని నర్మెట్ట, తరిగొప్పుల, జనగామ, బచ్చన్నపేట మండలాల్లో, ములుగు జిల్లాలోని మల్లంపల్లి, ములుగు, వెంకటాపురం మండలాల్లోని ఆయా గ్రామపంచాయతీలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. కలెక్టర్లు, ఎన్నికల పరిశీలకులు నామినేషన్ల సేకరణ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతుతో ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో సర్పంచ్ స్థానాలకు అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేయటం కనబడింది. రెండో విడతలో దాఖలైన నామినేషన్ల పరిశీలన బుధవారం జరగనుంది.

### - రేపటి నుంచి మూడో విడత

ఈనెల 17న జరిగే మూడో విడత పంచాయతీ ఎన్నికల కోసం బుధవారం నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలుకానుంది. చివరి విడతలో ఎన్నికలు జరిగే గ్రామపంచాయతీల్లో మూడు రోజులపాటు అంటే ఈనెల 5 వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగనుంది. ఈ మేరకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. మూడో విడత ఎన్నికలు జరిగే గ్రామపంచాయతీల్లో ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు జిల్లా కలెక్టర్లు శనివారం సూచనలు చేశారు. మొదటి, రెండో విడత ఎన్నికల నామినేషన్ల స్వీకరణ గడువు ముగియడంతో ఆ రెండు విడతల్లో ఎన్నికలు జరిగే గ్రామాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. బరిలో దిగిన అభ్యర్థులు తమ ప్రచారం చేపట్టారు.




## మూడో విడత నామినేషన్ల షెడ్యూల్ విడుదల

అక్షర దర్బార్, పరకాల: నడికూడ మండలంలో గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల సాధారణ ఎన్నికలకు సంబంధించిన మూడో విడత నామినేషన్ల షెడ్యూల్‌ను ఎంపీడీఓ రామకృష్ణ విడుదల చేశారు. డిసెంబర్ 3 నుంచి 9 వరకు నామినేషన్ ప్రక్రియ కొనసాగనున్నట్లు తెలిపారు.

### షెడ్యూల్ వివరాలు

నామినేషన్ల స్వీకరణ: డిసెంబర్ 3–5 (ఉ.10.30–సా.5 గంటల వరకు)
పరిశీలన: డిసెంబర్ 6
అభ్యంతరాల డిస్పోజల్: డిసెంబర్ 8
ఉపసంహరణ: డిసెంబర్ 9 (మ.3 గంటల లోపు)అనంతరం తుది జాబితా విడుదల.మొత్తం 14 గ్రామ పంచాయతీలు, 138 వార్డులకు గాను 6 క్లస్టర్లలో నామినేషన్లు స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను నిష్పాక్షికంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.



## "ప్రాడ్ కా ఫుల్ స్టాప్"

- సైబర్ నేరాలపై అవగాహన
- భూపాలపల్లి ఎస్పీ సంకీర్త్

అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: సైబర్ నేరాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంపు లక్ష్యంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో "ప్రాడ్ కా ఫుల్ స్టాప్" పేరుతో 42 రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తెలిపారు. ఈ కార్యక్రమం డిసెంబర్ 2 నుండి జనవరి 12 వరకు ప్రతి వారం ప్రత్యేక థీమ్‌తో అవగాహన కార్యక్రమాల రూపంలో కొనసాగుతుంది. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కళాశాల విద్యార్థులు, విద్యార్థినులకు ఆన్‌లైన్ జూమ్ మీటింగ్ ద్వారా సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివదర్ రెడ్డి మార్గదర్శకత్వంలో రూపొందించిన "ప్రాడ్ కా ఫుల్ స్టాప్" పోస్టర్‌ను ఈ సందర్భంగా విడుదల చేశారు. అనంతరం విద్యార్థులందరితో సైబర్ మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలనే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ప్రతిరోజూ సుమారు రూ. 2 వేల కోట్లు సైబర్ మోసాల రూపంలో నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. దీనికి నివారణ ప్రజల్లో అవగాహన పెంపునే ప్రధాన మార్గమని తెలిపారు. విద్యార్థులు సైబర్ భద్రతపై అవగాహన పెంపు ద్వారా తమ కుటుంబాలు, పరిసరాల్లోని ప్రజలను కూడా అప్రమత్తం చేయగలరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, టౌన్ సీఐ నరేష్‌తో పాటు పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 4న శ్రీ దత్త జయంతి

### - శ్రీ వరద దత్త క్షేత్రంలో వేడుకలు

అక్షరదర్బార్, హనుమకొండ: శ్రీ దత్తాత్రేయ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 4న గురువారం మార్గశిర మాసం పౌర్ణమి రోజున అవధూత దత్త పీఠధిపతి జగద్గురు శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ.. దత్త పీఠం ఉత్తరధికారి శ్రీ శ్రీ శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామీజీ ఆశీస్సులతో హనుమకొండ ములుగు రోడ్డులోని శ్రీ గణపతి సచ్చిదానంద వరద దత్త క్షేత్రంలో దత్త జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించడం జరుగుతుందని శ్రీ గణపతి సచ్చిదానంద దత్త జ్ఞాన బోధ సభ ట్రస్ట్ సభ్యులు వైవీ వామన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు భక్తులచే దత్తాత్రేయ స్వామీ ఉత్సవ మూర్తికీ అభిషేకం జరుగుతుందని, ఉదయం 11 గంటలకు పౌర్ణమి సందర్బంగా దత్త హోమం, పూర్ణహుతి, అనంతరం... ఆశ్రమంలోని మూల విరాట్ దేవుడు శ్రీ వరద దత్తాత్రేయ స్వామీ వారికీ తైలం, నువ్వుల నూనె, సుగంధ ద్రవ్యంలు, పంచ అమృతంలతో చందనం, విభూది, గంధంలతో అభిషేకం, అలంకరణ, నైవేద్యం, నివేదన, మహా మంగళహారతులు నివేదన జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదం వితరణ, మహా అన్నదానం నిర్వహించడం జరుగుతుందని, భక్తులు తమ ఆరోగ్యం కోసం నవగ్రహ బాధ నివారణ, ఇతర బాధల నివారణకు నువ్వుల నూనెతో అభిషేకం చేస్తే దత్తాత్రేయ స్వామీవారి విశేష అనుగ్రహం కలుగుతుందని వైవీ వామన్ రావు తెలిపారు.

## నలుగురు రౌడీషీటర్లు బైండోవర్

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మొగుళ్ళపల్లి మండల పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలో భాగంగా పోతుగల్లు, ఇసిపేట గ్రామాలకు చెందిన నలుగురు రౌడీషీటర్లను స్థానిక తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు ఎస్సై బి.అశోక్ తెలిపారు.

## రేపు నీటి సరఫరాలో అంతరాయం

అక్షర దర్బార్, పరకాల: పరకాల పురపాలక సంఘం పరిధిలో బుధవారం ఒకరోజు మంచినీటి సరఫరాను నిలిపివేయనున్నట్లు కమిషనర్ ఎస్. అంజయ్య తెలిపారు. పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రధాన పైప్‌లైన్ మరమ్మతు పనులు చేపడుతున్న కారణంగా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. పట్టణ ప్రజలు గమనించి సహకరించాలని కమిషనర్ కోరారు. మరమ్మతు పనులు పూర్తైన వెంటనే నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు.

## నామినేషన్ల హోరు..! వార్డు మెంబర్ల జోరు..!!

- ఒక్కో వార్డుకు ఇద్దరు, ముగ్గురు చొప్పున నామినేషన్లు
- ఆసక్తికరంగా నామినేషన్ల పర్వం

అక్షర దర్బార్ వెంకటాపూర్ : రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ మూడవరోజు ఆసక్తికరంగా కొనసాగుతుంది. మండల వ్యాప్తంగా వివిధ క్లస్టర్లలో నామినేషన్ల హోరు జోరు అందుకుంటుంది. సర్పంచ్ మరియు వార్డ్ మెంబర్ల నామినేషన్ల ప్రక్రియ ఆసంతం ఆసక్తికరంగా మారింది. అధికారపక్ష వార్డ్ మెంబర్లు ఒక్కొక్క వార్డుకు రెండు, మూడు నామినేషన్లు దాఖలు చేయనుండడం విశేషం. సర్పంచ్ నామినేషన్లు మాత్రం ఇద్దరు వేయగా నువ్వా, నేనా అన్నట్లుగా తలపడుతున్నారు. ఏది ఏమైనా అధికారపక్ష కాంగ్రెస్ అభ్యర్థి ఎవరనేది తెలియక నాయకులు, కార్యకర్తలు మదన పడుతున్నారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నుండి పోషాల అనిత–వీరమల్లు నిలువగా అధికారపక్ష పార్టీ నుండి మామిడి శెట్టి సుగుణ, మరియు చెన్నోజు రమా స్థానిక పోరులో తలబడునున్నారు. ఈ పోరులో ఎవరి గెలుపు దీమలో వారే ఉన్నారు. అంది వచ్చినా అవకాశంలో ఎవరూ కూడా పట్టు విడవడం లేదని బహాటంగానే నాయకులు చర్చించుకుంటున్నారు.

## చిన్నారిని లాలించిన ఎస్ఐ



అక్షర దర్బార్, వేలేరు : వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామపంచాయతీ ఎన్నికల్లో నామినేషన్ వేసేందుకు ఓ మహిళ చిన్న పాపతో తరలివచ్చింది. ఈ క్రమంలో సదరు మహిళ తన పాపతో ఇబ్బంది పడుతుండడాన్ని గమనించిన ఎస్సై సురేష్ ఆ పాపను తీసుకుని లాలించి కాసేపు ఆడించాడు. దీంతో ఆ మహిళ నామినేషన్ ప్రక్రియ సజావుగా పూర్తి చేసింది. పాపను లాలించి నామినేషన్ వేయడానికి సహకరించిన ఎస్సై సురేష్‌ను స్థానికులు అభినందించారు. నిత్యం విధుల్లో బిజీగా ఉంటూ పోలీస్ డ్రెస్ వేసుకొని కఠినంగా వ్యవహరించే పోలీసులు ప్రేమ చూపడంతో పలువురు సంతోషాన్ని వ్యక్తం చేశారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

## ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!

# మీ నమ్మకమే మా బలం!


Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : aksharadarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915